కొండంత నీటి కష్టానికి.. చెక్



గంగానగర్‌లో మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న నాయకులు (ఫైల్)

- గంగానగర్‌లో తీరిన మంచినీటి వెతలు
- 20 ఏళ్ల నాటి కల నెరవేరిన వేళ
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్న స్థానిక మహిళలు



దిగువ ప్రాంతమైన దర్గా నుండి సుమారు 260 మీటర్ల వరకు వేసిన పైపులైన్

20 ఏళ్ల నుంచి అక్కడి మహిళలు పడుతున్న కష్టానికి ఎవరూ స్పందించలేదు. ఓట్ల కోసం వచ్చినప్పుడు ఊరట వచనాలు పలికి పబ్బం గడుపుకున్నారే తప్ప ఇచ్చిన వాగ్దానం అమలు చేయలేదు. దీంతో తమ కష్టాలు తీరవులే అని అక్కడి అక్కచెల్లెమ్మలు వెతలను అలవాటు చేసుకున్నారు. అయితే జగనన్న ప్రభుత్వం మాత్రం ఇదంతా చూస్తూ ఊరుకోలేదు. కొండ దిగువ నుంచి ఎక్కడో కొండ మీదకి రూ. 5 లక్షలు వెచ్చించి సుమారు 260 మీటర్ల పైప్‌లైన్లు వేసింది. ప్రతి ఇంటి ముందుకు నేరుగా మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకుంది. దీంతో గంగానగర్ మహిళలు ఇది కలా నిజమా.. అనుకున్నారు. తమ పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు పొంగిపోయారు. కష్టంలో సాయపడిన నేత ఆనంద్‌కుమార్‌కు మనసారా కృతజ్ఞతలు చెప్పుకున్నారు.





గంగానగర్ కొండపైకి వేసిన మంచినీటి పైపులైన్

మల్కాపురం : ఒకనాడు ఆ ప్రాంత మహిళలు సుమారు 120 అడుగుల ఎత్తు గల కొండ పైకి మంచి నీటిని మోసుకెళ్లేవారు. కాస్త ఉన్నవారైతే మోటార్లు పెట్టుకుని **తమ ఇంటి దిగువ నుండి** రబ్బర్ పైపుల ద్వారా **నీటిని పంప్ చేసుకునే వారు.** ఇవి ఆనాటి ఈనాటి కష్టాలు కాదు. రెండు దశాబ్దాల వెతలు. జీవీఎంసీ 59వ వార్డు పరిధి ఎత్తయిన కొండ ప్రాంతమైన గంగానగర్ ప్రాంత వాసుల తిప్పలు ఇవి. 1999 నుండి ఈ ప్రాంత మహిళలు నీటి కోసం ఇలా బాధలు పడుతుండే వారు. టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన గణబాబుకు మహిళలు తమ కష్టం గురించి **చెప్పుకున్నారు. సమస్య పరిష్కరిం**చాలని వేడుకున్నారు. **ఫలితం లేదు. కానీ ఇటీవ**ల ఆ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణ సమయంలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆ ప్రాంత మహిళలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలు స్వయంగా చూసి చలించిపోయారు. వెంటనే జీవీఎంసీ కమిషనర్, మేయర్‌తో మాట్లాడారు. అక్కడి మహిళల నీటి కష్టాలు తీర్చారు. దిగువన గల దర్గా ప్రాంతం నుంచి సుమారు రూ. 5 లక్షల వ్యయంతో ఆడపడుచుల మంచినీటి కష్టాలు తీర్చారు ఆనంద్ కుమార్. జీఏ పైపులైన్లు వేయించి ప్రతి ఇంటి గుమ్మం ముందుకు కుళాయి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ ప్రాంత మహిళలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఒకనాడు దిగువ నుండి బిందెలతో ఇంటి అవసరాల కోసం నీటిని మోసుకునే వారం. నేడు ఆ పరిస్థితి లేదు. నేరుగా మా ఇంటి ముందుకు మంచినీళ్లు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైపులైన్లు వేయించి మా నీటి కష్టాలు తీర్చింది.

– అప్పలకొండ, గంగానగర్

ఆనంద్‌కుమార్‌కు, పూర్ణశ్రీకి కృతజ్ఞతలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా ప్రాంతానికి వచ్చిన ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ పూర్ణశ్రీ యాదవ్‌కు మా సమస్య వివరించాం. వారు స్పందించి దిగువ నుండి కొండ మీదకి పైపులైన్లు వేయించారు. దాంతో మంచినీటి సమస్య తీరింది.

– బొబ్బిలి లక్ష్మి, గంగానగర్

మహిళల కష్టాలకు ఆవేదన చెందాను



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గంగానగర్ కొండ ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడి మహిళలు కొండ పైకి నీటిని మోసుకెళ్లడం గమనించాను. మన వాళ్లు ఇలాంటి కష్టాలు పడుతున్నారే అని ఆవేదన చెందాను. అధికారులతో మాట్లాడి సమస్యకు చెక్ పెట్టాను. – **ఆడారి ఆనంద్‌కుమార్**, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

ప్రభుత్వానికి ధన్యవాదాలు



సుమారు 20 ఏళ్ల నుండి కొండ దిగువ నుండి పైకి నీటిని మోసుకునే వారం. చాలా మంది నాయకులు వచ్చారు. మా సమస్య పరిష్కరిస్తామన్నారు. కానీ అవేవీ జరగలేదు. కానీ నేడు జగనన్న ప్రభుత్వం మా కష్టానికి స్పందించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– బి.పాపమ్మ, గంగానగర్

హామీ నిలబెట్టుకున్నాం



ఎన్నికల ప్రచార సమయంలో ఈ ప్రాంత మహిళల నీటి కష్టాలు తీర్చుతానని హామీ ఇచ్చాను. దాని ప్రకారం ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో గంగానగర్ కొండ ప్రాంతానికి దిగువ నుండి జీఏ పైపులైన్లు వేయించాం. తద్వారా మంచి నీటి సమస్యకు చెక్ పెట్టాం.

– పుర్రె పూర్ణశ్రీయాదవ్, కార్పొరేటర్

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

మల్కాపురం: కనకమహాలక్ష్మి అమ్మవారి ప్రచార రథం బుధవారం పారిశ్రామిక ప్రాంతంలో తొలిసారి అడుగుపెట్టింది. కనక మహాలక్ష్మి దేవస్థానం వేద పండితులు మణికంఠశర్మ, పంచముఖి శర్మ, దేవస్థానం సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవో శిరీష సహకారంతో ట్రస్టు బోర్డు సభ్యురాలు మళ్ల ధనలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని హరి హర క్షేత్రానికి అమ్మవారి ప్రచార రథాన్ని తీసుకువచ్చారు. సుమారు 300 మంది మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకమార్చన చేశారు. అనంతరం దేవస్థానం సిబ్బంది మహిళలకు అమ్మవారి ప్రసాదాలు,అమ్మవారి ప్రతిమలు అందించారు.

వైఎస్సార్ బీమా అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నమ్మి శ్రీను

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సచివాలయం-1 పరిధికి చెందిన బూర్లె శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు అతడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని వైఎస్సార్ సీపీ వార్డు నాయకుడు నమ్మి శ్రీను బుధవారం అందజేశారు. సచివాలయ అడ్మిన్ ఎస్. అనిత, వెల్ఫేర్ కార్యదర్శి గౌసియా సోనీలతో కలసి మృతుడి భార్య విమలకు రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయించేలా తన వంతు కృషి చేస్తానని శ్రీను హామీ ఇచ్చారు.

రోడ్డు వేయడంపై హర్షాతిరేకాలు



బెహరా భాస్కరరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం పంచముఖ ఆంజనేయ ఆలయ ప్రాంతానికి చెందిన మహిళలు బుధవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును గోపాలపట్నంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు వేసి తమ కష్టాలు తొలగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని మా ఇబ్బందులు తొలగించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోఉప్పిలి చిన్నతల్లి, వెకటలక్ష్మి, సూర్యకళ, రమాదేవి, రవళి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయమందేలా చర్యలు

మల్కాపురం : గ్యాస్ పేలిన ఘటనలో బాధిత కుటుంబానికి బీమా సాయం అందే విధంగా నగరంలో పేరుగాంచిన విస్తరణ్ ఇన్‌ఫో సంస్థ చొరవ చూపిందని ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నవంబర్ 18న మల్కాపురం వద్ద జరిగిన గ్యాస్ పేలుడులో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనలో బాధితుల ఇల్లు ధ్వంసమయింది. అయితే బాధితులకు సాయం అందించటంలో గ్యాస్ కంపెనీ నిర్లక్ష్యం చూపిందని ఆ సంస్థ ఆరోపించింది. దీనిపై విస్తరణ్ ఇన్‌ఫో సంస్థ బీమా సంస్థకు సమాచారం అందించి ఆ కుటుంబానికి రూ. లక్షల బీమా వచ్చే విధంగా చొరవ చూపినట్లు సంస్థ ప్రతినిధి సుజాత తెలిపారు.

కృష్ణాలయంలో లలిత పారాయణం

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని యాదవవీధిలో గల కృష్ణాలయంలో లలిత పారాయణ, శ్రీ కృష్ణ నామాలతో భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం పాలకవర్గం ప్రతినిధులు, సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముందు ఇక్కడ కొలువుదీరిన శ్రీకృష్ణుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తులసి, సుగంధ పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. అనంతరం పలువురు మహిళలు లలిత పారాయణ చేశారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలు పఠించి, భజనల ద్వారా శ్రీకృష్ణుని స్తుతించారు.



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, పాలకవర్గ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నరవ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

గోపాలపట్నం: నరవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఎక్స్‌పో-23ను బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ జి. సత్యనారాయణ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన శక్తి పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎక్స్‌పోలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు చేపడుతున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

త్రినాథపురం ఫీడర్ పరిధిలో: త్రినాథపురం ఏరియా,గుడివాడ అప్పన్నకాలనీ,ఏఎస్ఆర్‌కాలనీ, దుర్గానగర్,ఎన్టీఆర్‌కాలనీ.

- మల్కాపురం ఫీడర్ పరిధిలో: ఏకేసీకాలనీ,కేకేఎల్ జీవీఎంసీ పంప్‌హౌస్ ఏరియా,ఈఎస్ఐ ఆస్పత్రి ఏరియా,ఐఎంయూ,సీఈఎంఎస్ ఏరియాతో పాటు సింధియా ప్రాంతాలు
- 11 కేవీ షిప్‌యార్డ్ ఫీడర్ పరిధిలో కాకరలోవ,జై ఆంధ్రకాలనీ,చింతలలోవ,డాల్ఫిన్ హిల్స్ ఏరియా,యారాడ అగ్రిగోల్డు ఏరియా,ఏపీ టూరిజం,ఎయిర్‌పోర్టు అథారిటీ ఏరియా,లైట్‌హౌస్ ఏరియా,యారాడ గ్రామం
- 11 కేవీ బీపీసీఎల్ ఫీడర్ పరిధిలో ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రి, చింతామణి దేవాస్థానం ఏరియాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది.

మర్రిపాలెం: జోన్-2 ఎస్ఎస్‌టీఎల్ పరిధిలో 11 కేవీ సీతన్న గార్డెన్స్, ఎన్ఏడీ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్ఏడీ ఫీడర్‌లో ఓల్డ్ కరాస, న్యూ కరాస, గణేష్‌నగర్, శాంతినగర్, ఎన్ఏడీ మెయిన్ రోడ్డు ప్రాంతాలు, సీతన్న గార్డెన్స్ ఫీడర్‌లో ఎంఎస్ఆర్ పార్కు, న్యూ రాంసాయి పార్లర్ డౌన్, సీతన్న గార్డెన్స్, లేన్సమ్ గ్రీన్స్ దరి నరసింహనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

'ప్రకృతి వనం' ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు. విభాగంలో ఉన్న పాత డంపింగ్ యార్డును ఉద్యోగులు ఇతర విభాగాల సహకారంతో పార్కుగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ విభాగంలోని స్క్రాప్‌ను వినియోగించి అందమైన పార్కుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తరంగ్ వాటర్ ఫౌంటెన్‌ను, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాగ్చీ లెహర్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామి, ఇతర సీజీఎంలు ఎ.కె. సోట్టీ, యు.శ్రీధర్, ఎస్.ఎం.ఎస్ విభాగం సీజీఎం పి.ఎస్.రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

'ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ అంశంపై మొదటి నుంచి కార్మిక సంఘాలు యాజమాన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయన్నారు. పోరాట కమిటీ సమావేశంలో చేసిన నిర్ణయం మేరకు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టామన్నారు. కార్మిక సంఘాలు, పోరాట కమిటీపై కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అటువంటి ఆరోపణలు పోరాటానికి నష్టం కలిగిస్తాయన్నారు. యాజమాన్యం జిందాల్ ఒప్పందాన్ని రద్దు చేయడం, కార్మికులకు వేతన సవరణ చేయడం తదితర డిమాండ్లపై పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బి.ఎస్. రాజు, బీఎంకె నాయక్, రమణమూర్తి, వెంకటరాజు, జి.ప్రభాకర రెడ్డి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాస నివాస గృహాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులంతా కలిసి ఇలాంటి ఏర్పాట్లు చేసుకోవడం శుభపరిణామమన్నారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాలు వంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. వార్డు పరిధిలోని మిగతాకాలనీ వాసులు కూడా ఇదే రీతిన ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పారిశుధ్య పనుల అడ్డగింత



గోపాలపట్నం బంక్ వద్ద పనులు అడ్డుకుంటున్న సమ్మెలో ఉన్న కార్మికులు

గోపాలపట్నం : మేము సమ్మె చేస్తున్నాం.. ఎవరు పని చేసినా ఊరుకునే ప్రసక్తి లేదంటూ పలు చోట్ల సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. అయితే ప్రధాన రహదారుల్లో కొందరు కార్మికులు, సూపర్‌వైజర్లు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఇది తెలిసిన కొందరు సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు ప్రత్యేకంగా ఆటోల్లో తిరుగుతూ పనులు చేస్తున్న వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గోపాలపట్నం బంక్ సెంటర్‌లో కొందరు పారిశుధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు చెత్త తొలగించే పనులు చేపడుతుండగా సమ్మె చేస్తున్న కొందరు కార్మికులు వచ్చి అడ్డుకున్నారు. వారిని దూషిస్తూ పరికరాలు లాక్కునే ప్రయత్నం చేశారు.

ఉక్కు దీక్షలకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

మల్కాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం హెచ్చరించారు. ప్లాంట్ ప్రైవేటీ కరణ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్న డిమాండ్‌తో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు సంఘీభావంగా పారిశ్రామిక ప్రాంత ఇంటక్ నాయకులు 58వ వార్డు శ్రీనివాసనగర్ నుంచి శ్రీహరిపురం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని బడా బాబులకు అప్పగించాలని చూడడం సిగ్గుచేటు అన్నారు.మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తూ దేశాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర సర్కార్ తన తీరు మార్చుకోవాలని లేకుంటే కార్మికులంతా ఏకమై తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు నర్సింగ్‌యాదవ్,తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా తరలివెళ్తున్న ఇంటక్ నాయకులు, సభ్యులు

మెరుగైన వైద్యం అందించడానికి కృషి

- సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత

గోపాలపట్నం: గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా జనరల్ సర్జన్ ఎం. సుజాత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సహచర వైద్యులు, సిబ్బంది ఆమెను అభినందించారు. ఇక్కడి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అనకాపల్లి ఆస్పత్రికి డెప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానన్నారు. ప్రధానంగా సాధారణ డెలివరీలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. నూతన భవనం అందుబాటులోకి వచ్చిన తర్వాత సేవలు మరింత సౌకర్యవంతంగా అందించ గలుగుతున్నామన్నారు.



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుజాత

సామాజిక భవన నిర్మాణ పనుల పరిశీలన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో చేపట్టిన సామాజిక భవన నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు బుధవారం గ్రామ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో వార్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి నిరంతరం చేస్తున్నామన్నారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, ఎం.ఎల్.నాయుడు, నల్ల పరశురామ్, కిలపర్తి నాగభూషణం, సత్యనారాయణ, రవి, కృష్ణ, నక్కా సూర్యనారాయణ, చంటి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

నిర్మాణ రంగ కార్మికులకు న్యాయం చేయాలి

మల్కాపురం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 59వ వార్డు లేబర్ జంక్షన్ వద్ద బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు.కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం జరుగుతుందని, బోర్డు ద్వారా వారికి అందాల్సిన సంక్షేమం అందటం లేదని ఆరోపించారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యు.రాజు,రామనాయుడు,రాజేష్,సుభాని,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.